క్లుప్తంగా

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్ రాఘవయ్యనగర్‌లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 110 కేవీ విద్యుత్ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ డీఈ రామారావు, ఏడీఈ యాదగిరి పర్యవేక్షణలో పనులు చేసి సరఫరాను ప్రారంభించినట్లు మమత సెక్షన్ ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు.

పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామపంచాయతీ శివారు పాపాయిగూడెంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం మండల నాయకుడు రేపాకుల వెంకన్న కుటుంబంతో పాటు సొంటి వెంకమ్మ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. పిండిప్రోలు మాజీ ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, తిరుమలాయపాలెం సొసైటీ ఉపాధ్యక్షుడు చామకూరి రాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పరికపల్లి చంద్రశేఖర్, రేపాకుల రవి తదితరులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్ శ్రీనగర్' విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ విద్యార్థులు సీహెచ్.అన్విత, ఎ.సుచరితను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం అభినందించారు. ఇన్‌స్పైర్ మానక్‌లో రెండేళ్లుగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులతో కలిసి పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్‌మానక్‌లో ఎగ్జిబిట్ ప్రదర్శించి జాతీయస్థాయికి ఎంపికవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో రవిమారుత్, పార్వతీరెడ్డి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. ముంబైలో జరిగిన మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పదిహేను మంది పతకాలు సాధించగా, విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం)లో రాష్ట్రస్థాయికి 10 మంది, ఏఎస్.రావు అవార్డ్స్ కౌన్సిల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌కు 9మంది ఎంపిక కాగా నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో 38మంది పతకాలు సాధించారని చెప్పారు. ఇక అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఐదుగురు, సీఆర్.రావు స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్‌లో 14 మంది, రామానుజన్ మ్యాథ్స్ నేషనల్ చాలెంజ్‌లో 12మంది ప్రతిభ చాటగా, సింగపూర్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లోనూ పతకాలు సాధించారని తెలిపారు.

క్రీడల్లో 'డేర్' విద్యార్థులు..

ఖమ్మంరూరల్: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో బుధవారం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్తగూడెంలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని కొత్తూరులో గల డేర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ దరిపల్లి కిరణ్ తెలిపారు. రన్నింగ్ 800 మీటర్ల విభాగంలో మణిదీప్, షాట్‌పుట్‌లో సోమయ్య, రన్నింగ్ 400 విభాగంలో మణిదీప్, లాంగ్‌జంప్‌లో విజయ్‌లు ద్వితీయ స్థానంలో నిలవగా వారిని యాజమాన్యం అభినందించింది.

చెక్కు అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సులతో 46వ డివిజన్‌కు చెందిన బుగ్గ బీరయ్యకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్నకృష్ణ అందజేశారు. వైద్య చికిత్స అనంతరం బీరయ్య తుమ్మల క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. రూ.60 వేలు మంజూరు కావడంతో ఆయన ఇంటికి వెళ్లి కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రజ్జి, నగర కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, నాయకులు కాటం యాదయ్య, తొగరు భాస్కర్, మాలిగ గౌరీశంకర్, దయ్యాల నాగేశ్వరరావు, బాల్దె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలన.. ప్రక్షాళన!

ఎన్నో ఏళ్లుగా ఒకే విభాగాల్లో తిష్టవేసి అవినీతి అక్రమాలకు పాల్పడడమే కాక.. విభాగాల్లో పెత్తనం చెలాయిస్తున్న సిబ్బందిపై కేఎంసీ కమిషనర్ దృష్టి సారించారు. ఈనేపథ్యాన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఒక్కో విభాగాన్ని ప్రక్షాళన చేస్తూ వస్తున్నారు. కీలక విభాగాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని బయటకు పంపించి.. వారి స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇప్పటికే డీజిల్ విభాగంలో సిబ్బందిని మార్చగా.. తాజాగా ఇంజనీరింగ్ విభాగంతో పాటు పలు కీలక విభాగాల్లో కొన్ని మార్పులు చేశారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది ప్రక్షాళన చేయనున్నట్లు తెలుస్తోంది. - ఖమ్మంమయూరిసెంటర్



కేఎంసీలో సిబ్బంది విభాగాల మార్పు
- డీబీలో రెగ్యులర్ ఉద్యోగులు
- ఇన్‌చార్జ్ ఆర్‌ఐలకు అదనపు బాధ్యతలు
- కొత్త వార్డు ఆఫీసర్లకూ విధులు

డ్రాయింగ్ బ్రాంచ్‌లో మార్పులు..

ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన డ్రాయింగ్ బ్రాంచ్ (డీబీ)లో సిబ్బందిని మార్చుతూ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్ణయించారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా డీబీలో విధులు నిర్వర్తిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు కొండల్‌రావు, స్వతంత్రరావులను తొలగించి వారి స్థానంలో వార్డు ఆఫీసర్లు బి.సౌమ్యశ్రీ , ఎం.నరసింహారావులను నియమించారు. ఇక డీబీలో ఈ1 క్లర్క్ జి.వెంకటేశ్వర్లును రెవెన్యూ సెక్షన్‌కు పంపించి, ఆయన స్థానంలో వార్డు ఆఫీసర్ జె.నాగరాజును నియమించారు. రూ.కోట్ల పనులకు సంబంధించిన పనంతా డీబీలోనే ఫైనల్ అవుతుండగా.. ఇక్కడ రెగ్యులర్ ఉద్యోగులు ఉంటేనే మంచిదనే భావనలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ఇన్‌చార్జ్ బాధ్యతలు..

రెవెన్యూ విభాగంలో ఆర్‌ఐలుగా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల్లో ఒకరికి పదోన్నతితో బదిలీ కావడం, మరొకరికి డిప్యూటేషన్ రద్దు కావడం, ఇంకొకరు బదిలీ కావడంతో ముగ్గురు ఆర్‌ఐల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పన్ను వసూళ్లపై ప్రభావం పడుతున్న నేపథ్యాన కేఎంసీలోని జూనియర్ అసిస్టెంట్లతో పాటు మరో బిల్ కలెక్టర్‌కు ఇన్‌చార్జ్ ఆర్‌ఐ బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఆర్‌ఐలుగా ఉన్న ఎ.జ్యోతి, వి.రామారావులతో పాటు జూనియర్ అసిస్టెంట్లు జార రాంబాయి, గరిక కవిత, బిల్ కలెక్టర్ ఎం.శ్రీనులకు ఇన్‌చార్జ్ ఆర్‌ఐ బాధ్యతలు అప్పగించారు. పన్ను వసూళ్ల కోసం వీరంతా ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుండే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేలా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

వార్డు ఆఫీసర్లకు విధులు..

ఇటీవల విధుల్లో చేరిన వార్డు ఆఫీసర్లకు కమిషనర్ విధులు కేటాయించారు. కొంతమందికి క్షేత్రస్థాయిలో, మరికొంత మందికి కార్యాలయంలో పలు బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్, సిస్టమ్ మేనేజర్, లైబ్రరీ విభాగాల్లో వీరికి విధులు కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లకు..

నగరంలో ట్రేడ్‌లైసెన్స్‌లు జారీ, వాటి ఫీజుల వసూళ్ల బాధ్యత శానిటేషన్ సూపర్‌వైజర్‌కు అప్పగిస్తూ కమిషనర్ నిర్ణయించారు. గత మూడేళ్ల ట్రేడ్ లైసెన్స్ ఫీజు బకాయిలను వసూలు చేసేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు విధులు కేటాయించారు. ఈ పర్యవేక్షణ బాధ్యతలను శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య చూసేలా ఆదేశాలు జారీ చేశారు. 60 డివిజన్‌లలో ఉన్న దుకాణాల నుంచి పక్కాగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేలా చూడాలని సూచించారు.

ఐజేయూ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ)డైరీని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, సమస్యల కోసం పోరాడుతున్న యూనియన్ పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, ఉపాధ్యక్షుడు మైసా పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మామిడాల భూపాలరావు, నాయకులు మైనుద్దీన్, చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనచారి, కళ్యాణ్, సత్యనారాయణ, మేడి రమేష్, బుర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: మార్క్స్, పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల మార్గదర్శిగా కేవీపీఎస్ క్యాలెండర్ ఉందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్నెస్పీ క్యాంప్‌లోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వై.విక్రమ్‌తో కలిసి ఆయన క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహనీయుల చిత్రపటాలు, వారి విలువైన నినాదాలతో నేటి తరం స్ఫూర్తి పొందేలా క్యాలెండర్లు ముద్రించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల వేదిక జిల్లా కన్వీనర్ ఎం.సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు ఉత్తమల ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు పాపిట్ల సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.రేవంత్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, పీఎస్‌ఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, సదానందం, ఎస్‌కె.సైదులు, పి.నాగరాజు, సిద్దెల రాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త సయ్యద్ షఫీ సంపాదకత్వంలో విద్యార్థులు రాసిన మా నాన్న హీరో పుస్తకాన్ని ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ నారాయణరావు, బాల సాహిత్య ప్రోత్సాహకులు యలమద్ది వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జానకీకరణ, పాఠశాల సిబ్బంది స్వరూప రాణి, రాధా శ్రీలత, కుద్దుస్, జానిమియా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎన్నెస్పీ కాలనీలో గల హైస్కూల్‌లో జిల్లా సంక్షేమ అధికారి కె.రామ్‌గోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి డాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త ఎస్‌డీ సమ్రీన్ బేటీ బచావో బేటీ పడావో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టు పి.ప్రమీల, కె.సతీష్, పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై..

ఖమ్మంక్రైం: రోడ్డు భద్రతపై వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై బుధవారం ఖమ్మంలో రవాణాశాఖాధికారులు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఆర్టీఓ ఎంవీఐ వెంకటరమణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంవీఐలు స్వర్ణలత, గోపికృష్ణ, సుమలత, చందర్, సిబ్బంది రమేష్, సరిత, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కూసుమంచి: కూసుమంచి మండల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శులు ఇంటూరి నాగరాజు చౌదరి, చంద్రారెడ్డి సమక్షాన బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వేల్పుల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా హనుమంతరావు, వీరభద్రం, వెంకన్న, రామాచారి, కార్యదర్శులుగా మధు, వీరస్వామి, అంజయ్య, కోశాధికారులుగా బాబునాయక్, శంకర్, మధు, వెంకన్న, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

10లోగా మార్కెట్ అందుబాటులోకి..

ఖమ్మంరూరల్: వచ్చే నెల 10లోగా మద్దులపల్లి మార్కెట్ అందుబాటులోకి తీసుకొస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్‌బాబు అన్నారు. బుధవారం మార్కెట్ నిర్మాణ ప్రాంతంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ నుంచి ఆటోనగర్ వరకు 100 అడుగుల డివైడర్‌తో పనులు నిర్వహిస్తుండగా, రూ.37కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు ప్రపోజల్‌ను ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



గుంత.. జరభద్రం!

మండలంలోని పండితాపురం నుంచి బండిపాడు వెళ్లే మార్గమధ్యలో బీటీ రహదారి కోతకు గురైంది. వర్షాకాలంలో వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో కోతకు గురై ఇదిగో ఇలా పెద్ద గుంత ఏర్పడింది. అయినా సంబంధిత అధికారులు గుంతను మట్టితో పూడ్చకపోవడంతో అటుగా వెళ్లే వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.రాత్రి అయితే ఇక అంతే సంగతి అంటున్నారు వాహనదారులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు. - కామేపల్లి



రోడ్డు కోతకు గురై ఏర్పడిన గుంత

టీజేఎస్ ప్లీనరీని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఫిబ్రవరి 2న నిర్వహించే టీజేఎస్ ప్లీనరీని జయప్రదం చేయాలని పలువురు నాయకులు కోరారు. బుధవారం ఖమ్మంలో జిల్లా కన్వీనర్ వి.బాబు అధ్యక్షతన జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. జిల్లాస్థాయి కరపత్రం ఫ్లెక్సీల కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించి, జిల్లాలో పార్టీ ప్రచారం విస్తృతంగా చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరావు, జిల్లా నాయకులు జంగిపల్లి రవి, సర్దార్, నాగేంద్రరావు, నరసింహారావు, మోహన్‌రావు, ప్రసాద్, అజీమ్, రాజేందర్, నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నటుడికి పురస్కారం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లాకు చెందిన సినీ, బుల్లి తెర నటుడు ఎస్‌పీఆర్ సాయిప్రసాద్‌కు రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కారం లభించింది. కృష్ణంరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సురవరం ప్రతాప్‌రెడ్డి ప్రెస్‌క్లబ్ వేదికగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాద్‌కు సంస్థ నిర్వాహకులు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, గజల్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ, గౌతమ్ రాజు, శివకృష్ణ, నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, విజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

ఖమ్మంవ్యవసాయం: అర్హత కలిగిన ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట మూడవ రోజు బుధవారం కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో విలేజ్ విద్యుత్ వర్కర్లు 7,114 మందిని ప్రభుత్వం పర్మినెంట్ చేసిందని, ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేసి, ఇతర ఉద్యోగుల మాదిరిగా గుర్తింపునివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ యూఈఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రసాద్ పాల్గొనగా.. దీక్షల్లో ఆర్టిజన్లు ఎల్వీ కృష్ణారావు, అప్పిరెడ్డి, బషీర్, సురేష్, భరత్, సయ్యద్, ఆసీఫ్, రాజా, ఎం.రాధ, నాగరాజు, సతీష్ కుమార్, సతీష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలకు కృషి చేయాలి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా నియమించబడిన కమిటీ సభ్యులు రైతుల ప్రయోజనాల కోసం కృషి చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు మానుకొండ రాధాకిషోర్ సూచించారు. బుధవారం రాధాకిషోర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నూతన కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డైరెక్టర్లను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు జీవై నరేష్, మిర్చి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, కోల్డ్ స్టోరేజీ శాఖ అధ్యక్షుడు గీతా వెంకన్న, పోలవరపు కోటేశ్వరరావు, భూక్యా భాషా నాయక్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో నిరసనల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల కోసం గ్రామసభలు నిర్వహిస్తుండగా.. రెండో రోజు బుధవారం నిరసనలు వెల్లువెత్తాయి. అర్హులైన తమ పేర్లు జాబితాలో లేవని అధికారులతో పలువురు వాగ్వాదానికి దిగిన తీరు కనబడింది. దీంతో అధికారులు సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.

అధికారులపై ఆగ్రహం..



మేకలతండాలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: సంక్షేమ పథకాలకు తాము అర్హులమైన తమకు పథకాలు అందడం లేదని పలు గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. బుధవారం మండలంలోని జల్లేపల్లి, ఏలువారిగూడెం, సుద్దవాగుతండా, మేకలతండా, తిరుమలాయపాలెం తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లిస్టుల్లో తమ పేర్లు లేవని, అధికారులు ప్రకటిస్తున్న లిస్టులలో పేదలకు కాకుండా ధనికుల పేర్లు ఉంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏఓ సీతారాంరెడ్డి, ఎంపీఓ సూర్యనారాయణ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాగ్వాదం..

కామేపల్లి: మండలంలోని కామేపల్లి, బాసిత్‌నగర్, ముచ్చర్ల, బర్లగూడెం, గోవిందాల గ్రామాల్లో ఆయా జీపీల ప్రత్యేకాధికారుల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. బుధవారం అధికారులు జాబితాల్లోని అర్హుల పేర్లు చదివి వినిపించగా.. పథకాల ఎంపికలో తమ పేర్లు రాలేదని కొందరు సంబంధిత అధికారులను నిలదీసి వారితో వాగ్వాదానికి దిగారు.

మధ్యలో బ్రేక్..



చిమ్మపుడిలో వాగ్వాదానికి దిగిన ప్రజలు

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం, చిమ్మపుడి, రాంక్యాతండా, పువ్వాడనగర్, రేగులచలక తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేస్తూ వేదికల వద్దకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం, చిమ్మపుడి, రాంక్యాతండా, పువ్వాడనగర్ సభలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులకు సైతం వాగ్వాదం చోటు చేసుకుంది. రఘునాథపాలెంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు మంజూరు కాలేదు.. కాని ఆస్తులు ఉన్న వారి పేర్లు జాబితాల్లో ఎలా వచ్చాయంటూ మండిపడ్డారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఎంపీడీఓ అశోక్‌లు సభ వేదికపైన ఉన్న సమయాన ఆగ్రహం వ్యక్తం చేయడంతో సభలో నుంచి వారు వెళ్లిపోయారు. అధికారులు సభ కొనసాగించకుండానే మధ్యలో వెళ్లిపోయారంటూ మండిపడుతున్న క్రమంలో సీఐ ఉస్మాన్‌షరీఫ్ తన బందోబస్తుతో వచ్చి అక్కడ నుంచి అందరినీ పంపించారు. చిమ్మపుడిలో దరఖాస్తులు ఎన్నిసార్లు ఇవ్వాలంటూ మహిళలు మండిపడ్డారు. రేగులచలక సభలో నేషనల్ హైవే రోడ్డులో భూములు ఇవ్వకుండా అధికారులు ఇచ్చిన జాబితాల ప్రకారం రైతు భరోసాలో పేర్లు తొలగించారని, తాము రోడ్డుకు భూమి ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించామని, కోర్టులో ఉండగానే తమ భరోసా ఎలా ఆపుతారంటూ కొంతమంది రైతులు దరఖాస్తులు అందించారు. కొన్నిచోట్ల సాగులో ఉన్న భూములు తొలగించి క్వారీలు, బీడు భూములు ఉంచారంటూ ఫైర్ అయ్యారు.

చెట్టుకో.. పుట్టకో జాబితా



ముస్తఫానగర్ బీసీ సంక్షేమ వసతిగృహంలో.. చెట్టుకు కట్టిన జాబితాలో పేర్లు చూసుకుంటున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన దరఖాస్తులు అన్నారు.. కులగణన సర్వే అన్నారు.. ఇళ్ల సర్వే అని, రేషన్‌కార్డుల సర్వే అని పథకాలను అమలు చేయకుండా ఇంకా ఎన్ని రోజులు ఇలా మోసం చేస్తారంటూ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. నగరంలో బుధవారం 21వ డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకు నిర్వహించిన వార్డు సభల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. 22వ డివిజన్ ముస్తఫానగర్ బీసీ సంక్షేమ వసతిగృహంలో నిర్వహించిన సభ తీరును కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించగా.. స్థానికులంతా ఇంకెన్నిసార్లు ఎన్ని సార్లు దరఖాస్తులు చేసుకోవాలి సార్ అంటూ ప్రశ్నించారు. 23వ డివిజన్‌లో సీపీఎం నాయకులు వందల పేర్లతో ఉన్న జాబితాలను సభల్లో పెట్టి ఎంత మందికి పథకాలు వర్తిస్తున్నాయో చెప్పకుండా ముగించడం ఏమిటని అధికారులను నిలదీశారు. 26వ డివిజన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని వార్డు సభను నిర్వహించారు. కాగా, అర్హుల జాబితాను చెట్లు, గడలకు కట్టడంతో వారి పేర్లను చూసుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు.

కేఎంసీకి క్యూ..

అర్హుల జాబితాల్లో పేర్లు లేని వారు కేఎంసీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన డెస్క్‌లో రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు క్యూ కడుతున్నారు. మంగళవారం 1 నుంచి 20వ డివిజన్ వరకు వార్డు సభలు ముగియడంతో ఆయా డివిజన్ల నుంచి 600కు పైగా దరఖాస్తులు వచ్చాయి.

గ్రామస్తుల ఆందోళనలు..



అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

కూసుమంచి: మండలంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభల్లో పలువురు ఆందోళనలకు దిగారు. మండలంలోని గోరీలపాడుతండా, జీళ్లచెరువు, కూసుమంచి, మల్లేపల్లి, ముత్యాలగూడెం, నాయకన్‌గూడెం, పాలేరు, పోచారం, గైగోళ్లపల్లి, లోక్యాతండా, రాజుపేట గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా.. కూసుమంచి, పాలేరు గ్రామాల్లో జరిగిన సభల్లో గ్రామస్తులు ఆందోళనలకు దిగడంతో పోలీసులు సర్ది చెప్పారు. కూసుమంచి సభలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను అధికారులు చదవకపోవడంతో పలువురు ఆందోళనకు దిగడంతో పాటు అధికారులను బయటకు వెళ్లకుండా అడ్డుకుని అర్హుల జాబితాను చదివిపించారు. దీంతో జాబితాలో అనర్హులే ఎక్కువగా ఉన్నారని, నిజమైన అర్హులకు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

అర్హులు కారంటూ..



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఖమ్మంరూరల్: ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభల పేరుతో లబ్ధిదారులను ఎంపిక చేయడంలో నిజమైన వారిని కాకుండా ఇందిరమ్మ కమిటీల కనుసన్నల్లో అనర్హులను ఎంపిక చేశారని ఆరోపిస్తూ మండలంలోని ఎంవెంకటాయపాలెంలో బుధవారం జరిగిన గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు నంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీల పేరుతో సొంత పార్టీ వారిని అర్హులు కాకున్నా ఎంపిక చేశారని పేర్కొన్నారు.

అరుపులు, కేకలతో..

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ, మంగాపురంతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలు అరుపులు, కేకలతో రసవత్తరంగా జరిగాయి. బోదులబండ సభలో పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా జరగలేదని స్థానికులు నిరసన వ్యక్తం చేయడంతోపాటు స్పెషల్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి శివతో వాగ్వాదానికి దిగారు. మండలంలోని కొంగర, కోనాయిగూడెం, శంకరగిరితండా, తిరుమలాపురంతండా, కొరట్లగూడెం తదితర గ్రామాల్లోనూ ఈ సభలు నిర్వహించారు.

అధికారులకు వినతులు..

- **ఖమ్మంమయూరిసెంటర్:** సర్వేలు, సభల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. బుధవారం నగరంలోని 23వ డివిజన్ సభలో పథకాల అమలుకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అర్హుల జాబితాను ఎప్పుడు ప్రకటిస్తారో తేదీ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ.జబ్బార్, మీరాసాహెబ్, వన్‌టౌన్ కార్యదర్శి నాగులు మీరా, నాయకులు శ్రీనివాసరావు, బేగం, నాగేశ్వరరావు, బి.అజితా పాల్గొన్నారు.
- **ఖమ్మం మామిళ్లగూడెం:** అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్రప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం 37వ డివిజన్ ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి మంద సరస్వతి, వీరవెల్లి రాజేష్, వన్‌టౌన్ అధ్యక్షుడు గడియల నరేష్, డివిజన్, బూత్ అధ్యక్షుడు వసుమర్తి నరేష్, దారా శ్యామ్, సోడె ధర్మేందర్, పొట్టి మూర్తి జనార్ధన్, రీగన్ ప్రతాప్, మిత్రవింద, పొట్టి మూర్తి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం 23వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ డీకొండ శ్యామ్ ఆధ్వర్యాన పేదవారికి పథకాలు అందించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడు గడీల నరేష్, రుద్రప్రదీప్, చింతమల్ల వీరస్వామి, బండ్లరీగన్ ప్రతాప్, పాలెపు రాము, గోలి ఫణికుమారి, ఊరుకొండ ఖాదర్, రుద్ర ప్రతాప్, మన్యం నాగమణి, వెంగళం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.